క్లుప్తంగా

పేదలకు వస్త్రదానం



కాకినాడ రూరల్ రమణయ్యపేటలో పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత రఘు సహకారంతో శనివారం పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త రవి శంకర్ పట్నాయక్ మాట్లాడుతూ పరులకు చేతనైనంత సేవ చేయడం మానవధర్మమని ఆ విధంగా దాతలు ముందుకు రావాలన్నారు. అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రెడ్నం రాజా, చంద్రరావు, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీవైఈఓ పరీక్షలు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీవైఈఓ (డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్) రాతపరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా ఏపీపీఎస్సీ పరీక్షల నోడల్ అధికారి, డీఆర్వో డాక్టర్ డి.తిప్పేనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లాలో 1120 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 787 మంది హాజరు కాగా, 333 మంది పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. జిల్లాలో సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్రగతి ఇంజినీరింగ్ కాలేజ్ తదితర ప్రాంతాల్లో ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. డీవైఈఓ రాతపరీక్షకు జిల్లాలో 72.32 శాతం అభ్యర్థులు హాజరైనట్టు నోడల్ అధికారి డాక్టర్ తిప్పేనాయక్ తెలిపారు.

పాదగయను దర్శించిన ఎంపీ విజయసాయిరెడ్డి సతీమణి



కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న సునందనారెడ్డి

పిఠాపురం: పిఠాపురంలో పాదగయ క్షేత్రాన్ని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సతీమణి సునందనారెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆమె ఆలయంలో కుక్కుటేశ్వరస్వామిని, రాజరాజేశ్వరిదేవిని, పురుహూతికా అమ్మవారిని, దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు భాషా పరిజ్ఞానం అవసరం



నీతి కథలు వివరిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దాపురం: తెలుగు భాష, తెలుగుతనంపై విద్యార్థులు చిన్న వయసు నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని ఎంఏ తెలుగు అధ్యాపకుడు టి.సుబ్బారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం తెలుగు పద్యాలు, నీతి కథలు, పుస్తక సమీక్షపై సుమారు 30 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు పది మంది హాజరు

సామర్లకోట: పదో తరగతి సప్లమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం హిందీ పరీక్షకు 50 మంది హాజరు కావాల్సి ఉండగా పది మంది మాత్రమే పరీక్ష రాశారు. మండల పరిధిలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ అధికారిగా (డిప్యూటీ డీఈఓ) ఆర్‌జే డానియేల్ రాజు తనిఖీ చేశారని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు.

గోలీసోడా కంపెనీపై విజిలెన్స్ దాడులు

పెద్దాపురం: స్థానిక సంస్కృతి గోలీ సోడా ఎంటర్‌ప్రైజెస్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, ఆహార తనిఖీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌వీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో గోలీ సోడా బాటిళ్లపై లేబుల్ లేకపోవడం, తయారీ తేదీలు లేకపోవడం వంటి వాటిని గుర్తించారు. కంపెనీ తయారీలో తేడాలు గుర్తించడంతో కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనధికార కూల్ డ్రింక్స్, సోడా తయారీలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఆయా శాఖల అధికారులు ముత్యాల నాయుడు, నాగ వెంకటరాజు, జాగన్నాథరెడ్డి, భార్గవమహేష్, లక్ష్మీనారాయణ, జీవ, నవీన్, వీరబాబు, కిశోర్ తదితరులున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- అధికారులకు కమిషనర్ ఆదేశం
- పలు ప్రాంతాలలో పర్యటించి అధికారులతో సమీక్ష సమావేశం



స్థానిక ప్రజల నుంచి తాగునీటి సమస్యను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: పైప్‌లైన్ మరమ్మతుల వల్ల నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన దుమ్ములపేట, సంజయ్ నగర్, డైరీ ఫారం ప్రాంతాల్లో ఎస్ఈ సత్యకుమారి, ఇతర సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్న నేపథ్యంలో స్వయంగా ప్రజలతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వెళ్లే ముడి నీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీలను అరికట్టేందుకు మరమ్మత్తులు చేస్తున్న దృష్ట్యా ఒకటో డివిజన్ నుంచి 13 డివిజన్ వరకు ఈనెల 23వ తేదీ నుంచి తాగునీటి సరఫరా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా నగరపాలక సంస్థ ట్యాంకర్లతో పాటు, ప్రైవేట్ ట్యాంకర్లను కూడా రప్పించి ఆయా ప్రాంతాల్లో తాగునీరు అందిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం దాదాపు 14 ట్యాంకర్ల ద్వారా సుమారు 80కి పైగా ట్రిప్పులు వేసి నీరు సరఫరా చేశారు. అయినప్పటికీ ఎక్కడైనా నీరు అందకపోయినా, ఇబ్బందులు ఉన్నా తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే ట్యాంకర్లను పంపించి పరిష్కరిస్తామన్నారు. అత్యవసర మరమ్మతుల దృష్ట్యా ఏర్పడిన ఈ అవాంతరానికి ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. నీటి సమస్య ఉంటే 98499 06507, 99597 99138, 96767 70461, 98484 71415 నెంబర్లను సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులను గుర్తించాలి



వేళంగిలో ప్రత్యేక అవసరాలుగల పిల్లల సర్వేను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు, సత్యనారాయణ

కరప: గ్రామాల్లో ఇంటింట సర్వే నిర్వహించి 18 ఏళ్లన్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి, గ్రామ సచివాలయం, భవిత కేంద్రంలో నమోదు చేయాలని సమగ్ర శిక్ష ఐఈ (ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్) కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సూచించారు. మండలం వేళంగిలో శనివారం ఐఈ ఆర్‌పీ (ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు నిర్వహిస్తున్న సర్వేను ఆయన ఎంఈఓ-2 పి.సత్యనారాయణతో కలిసి ఆకస్మిక తనిఖీచేసి, సర్వేలో అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ, ఆటపాటలతో అందిస్తున్న విద్య గురించి తల్లిదండ్రులకు వివరించి, భవిత కేంద్రానికి తీసుకువచ్చేలా చైతన్యపరచాలని, సర్వే నివేదిక ఏరోజుకారోజు సమగ్రశిక్ష కార్యాలయానికి, మండల భవితకేంద్రానికి అందజేయాలని ఐఈఆర్‌పీలకు కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు సూచించారు. వేళంగిలో ప్రత్యేక అవసరాలుగల ఇద్దరు చిన్నారులు మచ్చా వివేక్, తేజలను గుర్తించడం జరిగిందని ఐఈఆర్‌పీలు కన్నె స్వాతి, నురుకుర్తి మల్లీశ్వరి తెలిపారు.

నైపుణ్యంతో ఉన్నత శిఖరాలు

- ఎస్పీ సతీష్‌కుమార్
- వేసవి శిబిరం ముగింపులో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

కాకినాడ రూరల్: ప్రతి విద్యార్థీ వారి తల్లిదండ్రుల ఆశీర్వాదాలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. స్థానిక రమణయ్యపేటలోని మూడో బెటాలియన్ ఏపీఎస్పీ ఇంగ్లిష్ మీడియం హై స్కూల్ విద్యార్థుల పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ, వేసవి శిబిరం ముగింపు వేడుక మూడో ఏపీఎస్పీ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూడో ఏపీఎస్పీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కమాండెంట్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి పరీక్షలలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు, వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రతి విద్యార్థికీ తల్లితండ్రుల ఆశీర్వాదాలు ఉండాలని ఆయన చెప్పారు. విద్యార్థులు తమ నైపుణ్యం పెంపొందించుకోవాలని, పదో తరగతి అనేది పునాది అని మీ ప్రతిభను ఇంకా పెంపొందించుకోవాలని ఆయన మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ ఎల్ అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్లు వీవీవీ సత్యనారాయణ, ఇతర అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ విలియం బెనర్జీ, ఆర్ఎస్సై రామకృష్ణ, తల్లితండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీలో ఉద్యోగ మహోత్సవం

- 490 మందికి ఉద్యోగాలు
- తల్లిదండ్రులకు సత్కారాలు



ఉద్యోగం పొందిన విద్యార్థి, తల్లిదండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పట్టా పొందిన ఏ విద్యార్థీ ఉపాధి కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సు కోసం తిరగకూడదు. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అక్షాంక్ష. ఇందుకు అనుగుణంగా విద్యా విధానంలో ఆయన ప్రభుత్వం వివిధ మార్పులు తీసుకువచ్చింది. ముఖ్యంగా నైపుణ్యంపై దృష్టి పెట్టింది. దీంతో విద్యార్థులను వెతుక్కుంటూ సంస్థలే రావడం మొదలైంది. ఒకప్పుడు ఉన్నత విద్య ఇంజినీరింగ్‌లో మాత్రమే ఆఖరి సంవత్సరం అదీ పేరొందిన ప్రభుత్వ లేదా ప్రైవేట్ కళాశాలలకు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించేవారు. ఇప్పుడు అదే పంథా పాలిటెక్నిక్ కళాశాలకు విస్తరించింది. పదో తరగతి పూర్తయిన తరువాత పాలిటెక్నిక్ మూడేళ్లు అభ్యసించగానే వారి సామర్థ్యాన్ని బట్టి ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగ మహోత్సవం పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను అందరి సమక్షంలో సత్కరించే సరికొత్త సాంప్రదాయానికి నాంది పలికింది. కాకినాడ ఆంధ్రాపాలిటెక్నిక్ కళాశాలలో వివిధ బ్రాంచ్‌లకు చెందిన తృతీయ సంవత్సర విద్యార్థులు 490 మంది వార్షిక ఆదాయం రూ.1.8 లక్షల నుంచి రూ.8.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. దీంతో కళాశాలలో శనివారం ఉద్యోగ విజయోత్సవం పేరుతో కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా వీల్ ఇండియా లిమిటెడ్ హెచ్ఆర్ ఎ.దివాకర్, కాకినాడ సీపోర్టు ప్రతినిధి కరీమ్, ఎంవీఐ హరనాథ్‌రెడ్డి, ఎన్‌సీఎస్ గ్రూప్ హెచ్ఆర్ పీవీఎస్ఎన్ మూర్తి హాజరై విద్యార్థులకు విద్య ప్రాముఖ్యాన్ని వివరించి విద్యార్థులు,వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జనార్దన రావు, ఎంఎస్ఎన్ చార్టీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, ఎ.రమణబాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

సిబ్బంది అవగాహన సదస్సులో ఆర్వో కిశోర్



ఓట్ల లెక్కింపుపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్వో కిశోర్, హాజరైన సిబ్బంది

కాకినాడ రూరల్: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అప్రమత్తంగా ఉండి పారదర్శకంగా జరిగేలా చూడాలని సిబ్బందిని కాకినాడ రూరల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ కోరారు. రమణయ్యపేట మార్కెట్ సమీపంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, ఈవీఎంలలో ఓట్ల లెక్కింపును సమర్థవంతంగా చేపట్టాలని ఆర్వో కోరారు. ఓట్ల లెక్కింపులో పాటించాల్సిన నియమాలు, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఓట్ల లెక్కింపు హాలులోకి సెల్‌ఫోన్లు అనుమతించబోరన్న విషయాన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు విజయప్రసాద్, వాసిరెడ్డి రామకోటేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట ఏడీబీ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్



అచ్చంపేట ఏడీబీ రోడ్డులో పైప్‌లైన్ పనులతో నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: సామర్లకోట-కాకినాడ అచ్చంపేట రోడ్డులో శనివారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏడీబీ రోడ్డు విశాలంగా ఉండటంతో సామర్లకోట నుంచి కాకినాడకు రాక పోకలు సాగించే వారు ఎక్కువగా అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా వెళుతూ ఉంటారు. సామర్లకోట గోదావరి కాలువ నుంచి కాకినాడ కార్పొరేషన్‌లోని శశికాంత్‌నగర్‌లోని ఫిల్టర్ బెడ్ ప్లాంటుకు పైప్‌లైను పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం క్రేన్ సహాయంతో అచ్చంపేట రోడ్డులో 216 ఫ్లై ఓవర్ బ్రిడ్జి కూలిన ప్రదేశంలో పైప్ లైను పనులు ప్రారంభించారు. దాంతో ఈ రోడ్డులో రెండు వైపులా వాహనాలు బారులు తీరి నిలిచిపోయాయి. దాంతో సుమారు రెండు గంటల పాటు వాహన చోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. కొంత మంది అచ్చంపేట గ్రామం నుంచి సామర్లకోట చేరుకున్నారు. సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లే వారు ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు వేచి ఉండాల్సి వచ్చింది.

స్ట్రాంగ్‌రూమ్‌కు పటిష్ట భద్రత, కౌంటింగ్‌కు ఏర్పాట్లు



జేఎన్టీయూలోని స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న పిఠాపురం ఆర్వో, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి



పిఠాపురం నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో

- పిఠాపుం ఆర్వో, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: కాకినాడ జేఎన్టీయూకేలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ను శనివారం పిఠాపురం ఆర్వో, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సందర్శించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి, అక్కడి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూముకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్‌రూముకు వెళ్లి అక్కడి భద్రతను పర్యవేక్షిస్తున్నామన్నారు. వచ్చేనెల 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్వో వివరించారు.

దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఇంటి తగాదా విషయంలో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన శనివారం ఉదయం చేబ్రోలు గ్రామంలో జరిగింది. చేబ్రోలు గ్రామానికి చెందిన జాగు సుబ్రహ్మణ్యం ఇంటి రెండో అంతస్తుపై మేస్త్రీలు పని చేస్తుండగా సెంట్రింగ్ చెక్క పక్కన ఉన్న కాకి వెంకటేశ్వరరావు ఇంటిపై పడింది. దీంతో ఆగ్రహించిన వెంకటేశ్వరరావు వెంటనే ఇనుప రాడ్డు, కత్తితో సుబ్రమణ్యం ఇంటిలోకి ప్రవేశించి తలపై కొట్టి గాయపరిచాడు. ఈ విషయం బాధితుడు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయపడిన సుబ్రహ్మణ్యాన్ని పిఠాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాటిళ్లలో పెట్రోలు పోస్తే చర్యలు



బంకు యజమానులకు సూచనలిస్తున్న అధికారులు

గొల్లప్రోలు: సార్వత్రిక ఎన్నికల అనంతరం హింసాత్మక సంఘటనల నేపథ్యంలో బంకుల్లో ఖాళీ బాటిళ్లలో పెట్రోలు పోయరాదని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్చార్జి ఏవీవీఎస్ మూర్తి అన్నారు. మండలంలోని పెట్రోలు బంకుల వద్ద శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ బాటిళ్లు, డబ్బాల్లో పెట్రోలు పోయవద్దని సూచించారు. గ్రామాల్లో కిళ్లీ, కిరాణా దుకాణాల వద్ద బాటిళ్లలో పెట్రోలు విక్రయించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్ భాస్కర్, ఎస్ఐ బాలాజీ, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సాగరతీరంలో తుపాను అలజడి



ఉప్పాడ బీచ్ రోడ్డులో ఎగసిపడుతున్న అలలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి తుపానుగా మరుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాన్ ప్రభావంతో ఉప్పాడ తీరంలో సముద్రం ఉప్పొంగుతోంది. ఉప్పాడ, కోనసాపపేటలో తీర ప్రాంతాల్లోని అలలు ఎగసిపడి ఇళ్లు కోతకు గురవుతున్నాయి. కెరటాల తాకిడికి ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది.

అనుమతులిచ్చి తుస్సుమనిపిస్తారా?

- బాణసంచా విక్రయాలపై నిషేధాజ్ఞలు
- ముందుగానే అనుమతులు ఇవ్వడంతో భారీగా మందుగుండు సామగ్రి తయారీ
- తాజా ఆదేశాలపై వ్యాపారుల అయోమయం
- అడ్వాన్సుల వసూళ్లపై ఆందోళన



బాణసంచా తయారీ కేంద్రంలో నార బాంబులు తయారు చేస్తున్న కార్మికులు



వేట్లపాలెంలో రాకెట్లు తయారు చేస్తున్న కార్మికులు

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో శాశ్వత బాణసంచా తయారీదారులకు మందుగుండు సామగ్రి తయారీకి అనుమతి ఇచ్చి విక్రయాలపై మాత్రం నిషేధం విధించారు. దీంతో ఆ వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం విజేతల విజయోత్సవాలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. విజయోత్సవాలు నిర్వహిస్తే భారీ స్థాయిలో బాణసంచా కాల్చే అవకాశం ఉండేది. ఉత్సవాల నిషేధంతో ఆ అవకాశం లేకుండాపోయింది. నియోజకవర్గ పరిధిలో సామర్లకోట మండలంలో నాలుగు, పెద్దాపురం మండలంలో మూడు బాణసంచా తయారీ దుకాణాలు ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నామినేషన్ల దాఖలు సమయాల్లో భారీగా బణసంచా విక్రయాలు జరిగి పెద్ద మొత్తంలో కాల్చారు. వేట్లపాలెంలో బాణసంచా తయారీకి మంచి డిమాండ్ ఉంటుంది. అక్కడ మూడు దుకాణాలకు దీర్ఘకాలిక అనుమతులు ఉన్నాయి. ఉత్సవాలు, వేడుకల్లో నార బాంబులు, మిడతల దండ్లు, పేలింపు జువ్వలు, ర్యాకెట్లకు సంబంధించిన పెద్ద శబ్దాలు వచ్చే బాణాసంచాకు మంచి డిమాండ్ ఉంటుంది.


బాణసంచా తయారీపై నిబంధనలు

బాణసంచా తయారీలో తరచూ ప్రమాదాలు సంభవించి అనేక మంది ప్రాణాలను కోల్పోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించింది. ఆ నిబంధనలు పాటించకుంటే నేరంగా పరిగణించి కేసులు నమోదు చేయడంతో పాటు, లైసెన్సులు రద్దు చేస్తారు. వేట్లపాలెంలో తయారు చేసిన బాణసంచా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విక్రయాలతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు.

అగ్ని ప్రమాదాలకు అవకాశం

బాణసంచా కాల్పులపై ఎన్నికల కమిషన్ నిషేధాజ్ఞలు జారీ చేయడంతో ఆ తయారీదారుల్లో అయోమయం నెలకొంది. ఇప్పటికే తయారు చేసిన బాణసంచా గోదాముల్లో నిల్వ ఉందని, ఏదైనా అనుకోని పరిస్థితుల్లో పేలు సంభవించి అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. ఎన్నికల్లో విజేతలకు అరువుపై విక్రయిస్తే వాటిని కాల్చడానికి అనుమతి లేక పోతే వారి నుంచి ఏ విధంగా సొమ్ము వసూలు చేయాలనే ఆందోళనలో తయారీదారులు ఉన్నారు.


విక్రయాలపై నిషేధాజ్ఞలు



ఎన్నికల్లో విజయోత్సవాలు చేసుకునే వారికి బాణసంచా విక్రయించరాదని ఆదేశాలు వచ్చాయి. రెండో తేదీ నుంచి దుకాణాలను మూసివేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదేశించారు. జాతరల పేరుతో అనేక మంది బాణసంచా కొనుగోలు చేస్తారు. తెలంగాణ నుంచి బాణసంచాకు ఆర్డర్లు వచ్చాయి. మన రాష్ట్రంలోనే బాణాసంచా కాల్పుల నిషేధం.

– సత్యనారాయణ, బాణసంచా తయారీదారుడు, వేట్లపాలెం

నిబంధనలు పాటించాల్సిందే



సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల కమిషనర్ ప్రకటించిన నిబంధనలను తప్పని సరిగా పాటించాలి. ఫలితాల విడుదల అనంతరం బాణసంచా కాల్చడం నిషేధం. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయి. ఆర్డీఓ సూచనల మేరకు వీఆర్వోల ద్వారా బాణసంచా వ్యాపారులకు నోటీసులు ఇచ్చాం.

– జె.శ్రీనివాసు, తహసీల్దార్, సామర్లకోట